క్లుప్తంగా

ఉచిత శిక్షణ, ఉపాధి

కడప కోటిరెడ్డి సర్కిల్ : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఎస్ఎస్ సొల్యూషన్స్ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు వివిధ వృత్తి నైపుణ్య కోర్సుల్లో ఉచిత శిక్షణతోపాటు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని శృతి సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్ సెంటర్ హెడ్ జిలాన్ ఒక ప్రకటనలో తెలిపారు. సీసీ కెమెరా రిపేరు, సర్వీసింగ్, అలాగే కంప్యూటర్ రిపేర్, సర్వీసింగ్‌కు పదవ తరగతి ఉత్తీర్ణులైన వారికి రెండు నెలలపాటు శిక్షణ ఇస్తామన్నారు. 18–35 సంవత్సరాల మధ్య వయస్సు కలిగిన వారు ఇందుకు అర్హులన్నారు. ఆసక్తిగల వారు కడప నగరం కో ఆపరేటివ్ కాలనీలోగల తమ శిక్షణా కేంద్రానికి విద్యార్హత సర్టిఫికెట్లు, ఆధార్‌కార్డు, మూడు పాస్‌పోర్టు సైజ్ ఫోటోలతో రావాల్సి ఉంటుందన్నారు. వివరాలకు 99089 74770, 63053 84805 నెంబర్లలో సంప్రదించాలన్నారు.

ఉరుసు పోస్టర్ల ఆవిష్కరణ

కడప ఎడ్యుకేషన్: ఉరుసు మహోత్సవాన్ని విజయవంతం చేయాలని పీఠాధిపతి ముక్తి సయ్యద్ షా ఖ్వాజారుద్దీన్ ఖాదిరి నిజామి పేర్కొన్నారు. కడప అల్మాస్‌పేటలోని సిరాజుల్ మదరసాలో ఈ నెల 27వ తేదీ హజరత్ సయ్యద్ షా సర్ మత్ కదిరి రహమతుల్లా హిఅలే వారి ఉరుసుకు సంబంధించిన పోస్టర్స్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో తాహీర్ తారిఖలి, సబ్జాన్, షఫీఖాన్, ఖాదర్‌ఖాదిరి శిష్య బృందం పాల్గొన్నారు.

మధ్యంతర భృతి ప్రకటించాలి

కడప ఎడ్యుకేషన్ : ప్రభుత్వం మధ్యంతర భృతి ప్రకటించాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఇలియాస్‌బాషా, సంగమేశ్వరరెడ్డి అన్నారు. శనివారం కడపలోని ఎస్టీయూ భవన్‌లో జరిగిన ముఖ్య నాయకుల సమావేశంలో వారు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఆర్థిక కార్యదర్శి రామమోహన్, రాష్ట్ర మున్సిపల్ కన్వీనర్ రవిశంకర్‌రెడ్డి, రాష్ట్ర కౌన్సిలర్ చెన్నకేశవరెడ్డి, చెన్నూరు మండల అధ్యక్షులు వెంకటసుబ్బయ్య, ఒంటిమిట్ట మండల అధ్యక్షుడు మస్తాన్‌బాబు, సిద్దవటం మండల అధ్యక్షులు రమణయ్య, జిల్లా కౌన్సిలర్లు గంగాధర్, రాజేంద్ర తదితరులు పాల్గొన్నారు.

22న సెలవు ప్రకటించాలి

కడప ఎడ్యుకేషన్ : ఈ నెల 22న అయోధ్యలో బాలరాముని విగ్రహ ప్రతిష్ఠ జరుగుతున్న తరుణంలో విద్యాసంస్థలకు సెలవు ప్రకటించాలని ఏబీవీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కోడూరు మల్లికార్జున డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విగ్రహ ప్రతిష్ఠ నేపథ్యంలో ఎవరిప్రాంతంలో వారు ప్రత్యేక పూజలు నిర్వహిస్తారన్నారు.

డైరీ, క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న డీఈఓ రాఘవరెడ్డి

కడప ఎడ్యుకేషన్ : ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘానికి సంబంధించిన డైరీ, క్యాలెండర్‌ను శనివారం డీఈఓ రాఘవరెడ్డి తన కార్యాలయంలో సంఘం నాయకులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డీఈఓ రాఘవరెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమ్మ ఒడి, జగనన్న విద్యాకానుక, నాడు –నేడు తదితర కార్యక్రమాలతో విద్యాశాఖను అభివృద్ధి పథంలో పయనింప చేస్తున్నారన్నారు. ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేశారన్నారు. దీంతోపాటు ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు మధ్యాహ్న భోజనం పథకం చక్కటి మెనూతో అమలు చేస్తూ విద్యార్థులకు పౌష్టిక ఆహారాన్ని అందచేస్తున్నారన్నారు. ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మేకల శివార్జున మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి గంగరాజు, జిల్లా కార్యదర్శులు కట్టా గంగాధర్, బేరీ మోహన్, రాజబాబు, శివశంకర్, వెంకటేశ్వర్లు, దేవరాజు, విక్టర్ తదితరులు పాల్గొన్నారు.

మట్కా బీటర్లు అరెస్ట్



మట్కా బీటర్ల అరెస్ట్ వివరాలను తెలియజేస్తున్న సీఐ నరసింహారెడ్డి

కడప అర్బన్ : కడప చిన్నచౌక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో సీఐ పి. నరసింహారెడ్డి ఆధ్వర్యంలో ఎస్ఐ మహమ్మద్ రఫీ తమ సిబ్బందితో కలిసి తనిఖీలు చేపట్టారు. ప్రకాష్‌నగర్‌లో శనివారం సాయంత్రం మట్కా రాస్తున్న డి. మస్తాన్, కె. రమేష్‌లను అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి రూ. 38,230 నగదును, మట్కా స్లిప్‌లను స్వాధీనం చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ సుబ్బరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు ఎమ్మెల్యే రాక

చెన్నూరు : మండలంలోని చిన్నమాచుపల్లెలో ఆదివారం ఉదయం 9 గంటలకు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి దళితవాడ వరకు వేయనున్న సిమెంట్ రోడ్డు నిర్మాణ పనులకు భూమి పూజ కార్యక్రమానికి కమలాపురం ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్ రెడ్డి రానున్నట్లు చెన్నూరు వైఎస్సార్ సీపీ నాయకులు తెలిపారు.

శ్రీరామ శోభాయాత్రకు సర్వం సిద్ధం

- నగరమంతటా ఫ్లెక్సీలు, కాషాయ జెండాలతో కళకళ
- బెలూన్ ఎగురవేసిన పారిశ్రామికవేత్తలు
- రాజకీయ పార్టీలకు అతీతంగా నిర్వహణ



నగరంలో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు



హౌసింగ్‌బోర్డు శ్రీ కోదండ రామాలయంలో సిద్ధమైన వేదిక

కడప కల్చరల్ : కడప నగరంలో శ్రీరామ శోభాయాత్రకు సర్వం సిద్ధమైంది. అయోధ్యలో బాల రాముని ప్రతిష్ఠ సందర్భంగా ఆదివారం ముందస్తుగా శ్రీరామ శోభాయాత్రను నిర్వహించనున్నారు. నగరంలోని హిందూ భక్తులంతా అయోధ్య ఐక్యతా వేదిక పేరిట ఉమ్మడిగా ఈ యాత్రకు సిద్ధమయ్యారు. పటిష్ఠమైన ప్రణాళికతో ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఈ యాత్ర జరుగుతుంది. చిన్నచౌకులోని శ్రీ వీరాంజనేయస్వామి ఆలయం వద్ద ప్రారంభమై హౌసింగ్‌బోర్డు కాలనీలోని శ్రీ కోదండరామస్వామి ఆలయం వద్దకు చేరుకున్నాక యాత్ర ముగుస్తుంది.

■ అయోధ్యలో శ్రీరామ విగ్రహ ప్రతిష్ఠ సందర్భంగా కడప నగరంలో పలు దేవాలయాల నిర్వాహకులు, కమిటీల ప్రతినిధులు, హిందూ సంఘాలు, హిందూ ధార్మిక సంస్థల ప్రతినిధులు రెండు వారాలుగా ఈ యాత్ర నిర్వహణ కోసం తరుచూ సమావేశాలు నిర్వహించారు. ఉమ్మడిగా ఒక ప్రణాళిక రూపొందించుకుని కార్యక్రమాన్ని రూపొందించారు. ఇందుకు అయ్యే ఖర్చును కూడా భక్తులే భరించేందుకు ముందుకు వచ్చారు.

■ చిన్నచౌకు నుంచి బయలుదేరనున్న ర్యాలీ కడప నగరంలో 20 ముఖ్యమైన కూడళ్ల మీదుగా వెళ్లేందుకు నిర్ణయించారు. ర్యాలీ ఉదయం 7 గంటలకు బయలుదేరుతుంది. ప్రతి కూడలి వద్ద భక్తులు స్వచ్ఛందంగా అల్పాహారం, శీతల పానీయాలు, మంచినీటి సౌకర్యం కల్పించారు. కొన్ని కూడళ్లలో ఉదయం 10.30 గంటల తర్వాత యాత్ర ముగిసేవరకు మధ్యాహ్న భోజన సౌకర్యం కల్పించారు.

రాజకీయాలకు అతీతంగా నిర్వహణ..

శ్రీరామ శోభాయాత్రను రాజకీయ పార్టీలకు అతీతంగా నగరంలోని ప్రముఖులంతా తోడ్పాటుగా నిలుస్తున్నారు. ఎవరి శక్తికి తగ్గట్లు వారు ఏర్పాట్లల్లో నిమగ్నమయ్యారు. పారిశ్రామికవేత్తలు పలువురు నగరంలో ప్రధాన కూడళ్లల్లో సంఘీభావం తెలుపుతూ బెలూన్లు ఎగురవేశారు. ఉదయం నుంచి సాయంత్రం వరకూ భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా సేవా కార్యక్రమాలు నిర్వహించేందుకు పలు సంస్థలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చాయి. పదిరోజులుగా కసరత్తు చేస్తున్న నేపథ్యంలో భారీ స్థాయిలో ర్యాలీ ఏర్పాట్లకు సర్వం సిద్ధమైంది.

నగరమంతటా..

యాత్ర కోసం నిర్వాహకులు నగరాన్ని కాషాయ జెండాలతో అలంకరించారు. నగరంలోని ప్రతి కూడలిలోనూ 3నుంచి 8 వరకు మొత్తం 150కి పైగా భారీ ఫ్లెక్సీ హోర్డింగులను ఏర్పాటు చేశారు. ప్రధాన రోడ్లతోపాటు చిన్నచిన్న సందుగొందుల్లో కూడా స్థానిక యువత నిర్వాహకుల సహకారంతో కాషాయ జెండాలు అలంకరించి ధార్మిక భావన కల్పించేందుకు ఏర్పాట్లు చేశారు. రాజకీయ పార్టీలకు అతీతంగా నగరంలోని దాదాపు అన్ని పార్టీల ప్రముఖులు యాత్రలో పాల్గొనే అవకాశం ఉంది. జిల్లా చరిత్రలో ఇంతకుముందెన్నడూ జరగని విధంగా ఈ యాత్ర చిరస్థాయిగా నిలిచిపోవాలన్న ధ్యేయంతో నిర్వాహకులు కార్యక్రమాన్ని రూపొందించారు. పలువురు హిందువులు తమ ఇళ్లపై కాషాయ జెండాలను ఏర్పాటు చేయగా, మరికొందరు ఇళ్ల ముందు, తలుపులపైన అయోధ్య ప్రతిష్ఠ కార్యక్రమ పోస్టర్లు, కరపత్రాల స్టిక్కర్లు ఏర్పాటు చేసుకున్నారు.

■ ర్యాలీ ముగింపు ప్రదేశమైన హౌసింగ్‌బోర్డు కాలనీ శ్రీ కోదండ రామాలయం వద్ద ఉత్సవాల కోసం నిర్వాహకులు వేదికను సిద్ధం చేశారు. కళాకారులు ర్యాలీలో తమ ప్రదర్శనల కోసం వారం రోజుల నుంచి శిక్షణ పొందుతున్నారు. ఉదయం 7 గంటలకు చిన్నచౌకు శ్రీ వీరాంజనేయస్వామి ఆలయం వద్ద ప్రత్యేకంగా రూపొందించిన రథంపై ప్రత్యేకంగా తెప్పించిన 18 అడుగుల రాముడి విగ్రహాన్ని కొలువుదీర్చి ప్రత్యేక ఆకర్షణగా ర్యాలీలో నిలుపనున్నారు.

క్రీడలతో ఒత్తిడి దూరం

కడప వైఎస్ఆర్ సర్కిల్ : పోస్టల్ ఉద్యోగులకు క్రీడలతోనే మానసిక ఒత్తిడి దూరం అవుతుందని కడప డివిజన్ పోస్టల్ సూపరింటెండెంట్ ఎ. రాజేష్ పేర్కొన్నారు. గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని నగర శివార్లలోని సాక్షి జిల్లా ప్రధాన కార్యాలయం ఎదుట ఉన్న క్రీడా మైదానంలో పోస్టల్ శాఖ సిబ్బందికి శనివారం క్రికెట్ పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కడప డివిజన్‌లోని పోస్టల్ సిబ్బంది నిత్యం ఉద్యోగ రీత్యా బిజీగా గడుపుతున్న నేపథ్యంలో ఇటువంటి క్రీడలు మానసిక ఉల్లాసానికి ఎంతో దోహదపడతాయన్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ పోస్టల్ సూపరింటెండెంట్ విజయ భాస్కర్, పోస్టల్ ఇన్‌స్పెక్టర్ అమర్నాథ్ పాల్గొన్నారు.

29న కలెక్టరేట్ ఎదుట ఆందోళన

కడప వైఎస్ఆర్ సర్కిల్: ప్రభుత్వ పాఠశాలలలో పని చేసే స్వీపర్లకు కనీస వేతనం రూ. 21 వేలు ఇవ్వాలని 29న కలెక్టర్ కార్యాలయం ఎదుట చేపడుతున్న ఆందోళనను జయప్రదం చేయాలని ఏఐటీయూసీ జిల్లా డిప్యూటీ జనరల్ సెక్రెటరీ కెసి.బాదుల్లా పేర్కొన్నారు. శనివారం నగరంలోని హోచిమిన్ భవన్‌లో ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేసే స్వీపర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల ఆవరణలో ఉన్న మరుగుదొడ్లు పరిశుభ్రంగా ఉంచడానికి గత నాలుగు సంవత్సరాలు పైబడి రూ. 6వేలు వేతనంతో ఆయాలుగా (స్వీపర్లుగా) నియమించారన్నారు. వీరికి వేతనం పెంచాలని కోరారు.

కమనీయం శ్రీ సీతారాముల కల్యాణం



స్వామి, అమ్మవార్ల కల్యాణాన్ని నిర్వహిస్తున్న అర్చకులు

కడప కల్చరల్ : కడప నగర పరిధిలోని 50వ డివిజన్‌లోగల రూకవానిపల్లె గ్రామంలో శనివారం శ్రీ సీతారాముల కల్యాణోత్సవాన్ని కమనీయంగా నిర్వహించారు. అయోధ్యలో శ్రీరామ విగ్రహ ప్రతిష్ఠ నేపథ్యంలో గ్రామ ప్రముఖులు పోతుల కంచమ్మ, చిన్న ఓబుల్‌రెడ్డి ట్రస్టు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. తొలుత ఆ గ్రామంలోని పురాతన శ్రీరాముని ఆలయంలో తొలి పూజలు నిర్వహించి ఊరేగింపుగా సచివాలయం వద్ద ఏర్పాటు చేసిన కల్యాణ వేదిక వద్దకు ఉత్సవ మూర్తులను చేర్చారు. వధూవరులుగా అలంకరించిన స్వామి, అమ్మవార్ల మూర్తులకు అర్చక సంఘం ఐక్యవేదిక అధ్యక్షులు విజయ్‌భట్టర్ బృందం శాస్త్రోక్తంగా కల్యాణోత్సవాన్ని నిర్వహించింది. అనంతరం హాజరైన భక్తులందరికీ కల్యాణ విందు ఏర్పాటు చేశారు. రూకవానిపల్లెతోపాటు పాలెంపల్లె, సాయిపేట తదితర సమీప ప్రాంతాల ప్రజలే కాకుండా నగరం నుంచి కూడా భక్తులు కల్యాణోత్సవానికి హాజరయ్యారు.

చట్టాలపై అవగాహన కలిగిఉండాలి

సీనియర్ సివిల్ జడ్జి బాబా ఫక్రుద్దీన్



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి బాబా ఫక్రుద్దీన్

కడప ఎడ్యుకేషన్ : ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ కమ్ సీనియర్ సివిల్ జడ్జి బాబా ఫక్రుద్దీన్ పేర్కొన్నారు. శనివారం కడప బాలాజీనగర్‌లోని యస్వీ ఇంజనీరింగ్ కళాశాలలో లైంగిక వేధింపుల నిరోధక చట్టం–2023, లింగ సమానత్వం మొదలగు అంశాలపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పని చేసే ప్రదేశంలో మహిళలు లైంగిక వేధింపులకు గురైనప్పుడు వెంటనే ఫిర్యాదు చేయాలన్నారు. ఇంకా పలు చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో రెవిన్యూ డివిజనల్ అధికారి రంగస్వామి, బార్ ప్రెసిడెంట్ రాఘవరెడ్డి, యస్వీ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ వీర సుదర్శన్‌రెడ్డి, డిస్ట్రిక్ట్ చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ సుభాష్, వన్‌స్టాప్ సెంటర్ ఏఓ అశ్వని, డిస్ట్రిక్ట్ ప్రాజెక్టు అధికారి భాస్కర్‌రెడ్డి, జిల్లా పంచాయతీ అధికారి ప్రభాకర్‌రెడ్డి, సమగ్రశిక్ష జిల్లా ప్రాజెక్టు అధికారి అంబవరం ప్రభాకర్‌రెడ్డి, వైవీయూ, ఆర్కిటెక్చర్ యూనివర్సిటీ ప్రొఫెసర్లు తదితరులు పాల్గొన్నారు.

వాతావరణానికి అనుగుణంగా పంటలను సాగు చేసుకోవాలి



మాట్లాడుతున్న వ్యవసాయ పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్త శ్రీనివాస ఆచారి

కడప అగ్రికల్చర్ : వాతావరణానికి అనుగుణంగా రైతులు పంటలను సాగు చేసుకుంటే అధిక దిగుబడులను సాధించుకోవచ్చని వ్యవసాయ పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్త శ్రీనివాస ఆచారి పేర్కొన్నారు. శనివారం కడప నగర శివార్లలోని ఊటుకూరు వ్యవసాయ పరిశోధన కేంద్రంలో రైతు భరోసా శిక్షణా కార్యక్రమాన్ని జిల్లాలోని ఏడీఏలకు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన జిల్లాలో సాగులో ఉన్న పంటలు, వాటి పరిస్థితి, వచ్చిన దిగుబడుల గురించి ఆయా డివిజన్లలో నమోదైన ఉష్ణోగ్రతల గురించి అడిగి తెలుసుకున్నారు. వాతావరణానికి అనువైన పంటలను సాగు చేసుకోవాలన్నారు. శాస్త్రవేత్త సునీల్‌కుమార్ మాట్లాడుతూ ప్రస్తుతం సాగులో ఉన్న పంటలకు ఆశించిన తెగుళ్ల నివారణ చర్యలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఆత్మ పీడీ విజయలక్ష్మి, కేవీకే సమన్వయకర్త వీరయ్య, శాస్త్రవేత్తలు రామలక్ష్మి, భాగమతిప్రియ, ఏడీఏలు పాల్గొన్నారు.

టైగర్ ఉనికిని కనుగొనండి



పెద్దపులి ఉనికిని కనుగొనేందుకు సిబ్బందితో సమావేశమైన దృశ్యం

అట్లూరు : లంకమల అభయారణ్యంలో పెద్దపులి (టైగర్) ఉనికిని కనుగొనేందుకు ముమ్మర చర్యలు చేపట్టాలని నాగార్జునసాగర్, శ్రీశైలం టైగర్ రిజర్వ్ అధికారులు రమేష్, శ్రీధర్, సుబ్బరాయుడు పేర్కొన్నారు. అట్లూరు మండల పరిధిలోని కలివికోడి పరిశోధన కేంద్రంలో శనివారం సిద్దవటం, బద్వేలు, ఒంటిమిట్ట, వేంపల్లి, కడప రేంజ్ అధికారులతో సిద్దవటం రేంజ్ అధికారి కళావతి ఆధ్వర్యంలో పెద్దపులి ఉనికిని కనుగొనేందుకు సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో అధికారులు మాట్లాడుతూ పెద్దపులి ఉనికిని కనుగొనేందుకు ప్రతి ఒక్కరు ప్రయత్నించాలని, అందుకోసం అధునాతన టెక్నాలజీతో కెమెరాలు అమరుస్తామన్నారు. పెద్దపులి ఉనికిని ఏ విధంగా కనుగొనాలి, ఏయే ప్రాంతాల్లో ఆ పులి సంచరిస్తుంది, అది నివసించేందుకు అనుకూల ప్రదేశాలు ఎలా ఉంటాయి అనే అంశాలపై సిబ్బందికి వివరించారు. సమావేశంలో సిద్దవటం సెక్షన్ అధికారి సురేష్‌బాబు, ఆయా రేంజ్ పరిధులలోని సెక్షన్ ఆఫీసర్లు, బీట్ ఆఫీసర్లు, అసిస్టెంట్ బీట్ ఆఫీసర్లు, ప్రొటెక్షన్ వాచర్లు తదితరులు పాల్గొన్నారు.

ఫొటో ఫెయిర్ పోస్టర్ల ఆవిష్కరణ



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఫొటోగ్రాఫర్స్ అసోసియేషన్ ప్రతినిధులు

కడప కల్చరల్ : కడప ఫొటోగ్రాఫర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం స్థానిక మానస్ ఇన్ సమావేశ మందిరంలో ఫొటో ఫెయిర్ పోస్టర్ల ఆవిష్కరణ నిర్వహించారు. ఈనెల 27, 28 తేదీల్లో తిరుపతిలో జరగనున్న రాయలసీమ ఫొటో ఫెయిర్ ఎగ్జిబిషన్ కోసం రూపొందించిన ఈ పోస్టర్లను జిల్లా ఫొటోగ్రాఫర్ అసోసియేషన్ పక్షాన ఇంటాక్ జిల్లా చాప్టర్ కన్వీనర్ లయన్ కె.చిన్నపరెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫొటోగ్రఫీ కళాత్మకమైన, సజ్జనాత్మకమైన కళ అని, వ్యాపార సరళిలో ఎప్పటికప్పుడు ఈ కళను అప్‌డేట్ చేసుకుంటే రాణించవచ్చని సూచించారు. ఏపీ ఫొటోగ్రాఫర్స్ అసోసియేషన్ గౌరవాధ్యక్షులు పద్మప్రియ చంద్రారెడ్డి కార్యక్రమ వివరాలు తెలిపారు. కార్యక్రమంలో కడప ఫొటోగ్రాఫర్స్ అసోసియేషన్ అధ్యక్షులు శంకర్‌రెడ్డి, కార్యదర్శి శివరాం, సభ్యులు గోటూరు నాగేంద్ర, సుధాకర్, బాలాజీ, ప్రతాప్, కోటేశ్వరరావు, జమాల్ తదితరులు పాల్గొన్నారు.

బకాయిలను చెల్లించాలి

కడప ఎడ్యుకేషన్ : ఉద్యోగ, ఉపాధ్యాయులకు రావాల్సిన బ బకాయిలను ప్రభుత్వం వెంటనే చెల్లించాలని ఎస్టీఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు రామాంజనేయులు డిమాండ్ చేశారు. శనివారం కడపలోని ఎస్టీఎఫ్ జిల్లా కార్యాలయంలో జరిగిన జిల్లా కార్యవర్గ సమావేశానికి హాజరైన ఆయన మాట్లాడుతూ ఉద్యోగులకు ఇవ్వాల్సిన పీఎఫ్, ఏపీ జీఎల్ఐసి, సరెండర్, డీఏ అరియర్స్ మొదలైన ఆర్థిక బకాయిలను విడుదల చేయాలన్నారు. ఇంకా పలు అంశాలపై మాట్లాడారు. ఈ సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు తుపాకుల మురళి, జిల్లా గౌరవ అధ్యక్షులు ఆవుల శ్రీనివాసులు, జిల్లా ప్రధాన కార్యదర్శి రామచంద్ర, జిల్లా, మండల నాయకులు పాల్గొన్నారు.

హక్కుల కోసం పోరాడాలి

కడప వైఎస్ఆర్ సర్కిల్ : యువత తమ హక్కుల కోసం పోరాటం చేయాలని ఆప్ కి ఆవాజ్ రాష్ట్ర కార్యదర్శి మగ్బూల్ బాష, బ్లూ డైమండ్ హోటల్ ప్రొప్రైటర్ సయ్యద్ జైద్ పేర్కొన్నారు. శనివారం నగరంలోని బ్లూ డైమండ్ హోటల్ లో ఆప్ కి ఆవాజ్ క్యాలెండర్ ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఆప్ కి ఆవాజ్ నాయకులు ఆరిఫ్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

● జీవన సాఫల్యం



డా.ఇంద్ల రామసుబ్బారెడ్డి దంపతులకు జీవన సాఫల్య పురస్కారాన్ని అందజేస్తున్న చిరంజీవి, ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు, హైకోర్టు సీనియర్ న్యాయమూర్తి జస్టిస్ శేషసాయి, యార్లగడ్డ లక్ష్మీ ప్రసాద్

సాక్షి, విశాఖపట్నం : ఎన్టీఆర్ 28వ పుణ్యతిథి, ఏఎన్నార్ శతజయంతి ఉత్సవాలతో పాటు లోక్‌నాయక్ ఫౌండేషన్ 20వ వార్షిక పురస్కారాల ప్రదానోత్సవం సంస్థ వ్యవస్థాపకుడు ప్రొ.యార్లగడ్డ లక్ష్మీ ప్రసాద్ ఆధ్వర్యంలో విశాఖలోని రుషికొండలో శనివారం నిర్వహించారు. ప్రముఖ నవలా రచయిత యండమూరి వీరేంద్రనాథ్‌కు రూ.2 లక్షల నగదు బహుమతితో సాహిత్య పురస్కారాన్ని ముఖ్య అతిథి చిరంజీవి చేతుల మీదుగా ప్రదానం చేశారు. అదేవిధంగా ప్రముఖ మనో వైద్యులు డా.ఇంద్ల రామసుబ్బారెడ్డి, అంతర్జాతీయ పర్యాటక శాఖ నిపుణులు విల్సన్ సుధాకర్ తుల్లుమిల్లి, బెంగళూరు తెలుగు సమాఖ్య అధ్యక్షుడు రాధాకృష్ణంరాజుకి జీవన సాఫల్య పురస్కారాలు అందజేశారు.

రహదారి భద్రత మాసోత్సవాలను జయప్రదం చేయాలి



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న జేసీ గణేష్‌కుమార్, రవాణాశాఖ అధికారులు

కడప వైఎస్ఆర్ సర్కిల్ : ఈ నెల 20 నుంచి ఫిబ్రవరి 19 వరకు నిర్వహిస్తున్న జాతీయ రహదారి భద్రత మాసోత్సవాలను జయప్రదం చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ గణేష్ కుమార్ పేర్కొన్నారు. శనివారం కలెక్టరేట్‌లోని సభాభవనంలో జాతీయ రహదారి భద్రత మాసోత్సవాల పోస్టర్లను, బ్యానర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో పాఠశాల బస్సు డ్రైవర్లకు, కళాశాల విద్యార్థులకు, పాదచారులకు, ఆటో, లారీ డ్రైవర్లకు రోడ్డు ప్రమాదాల నివారణపై అవగాహన కల్పించేందుకు నెల రోజుల పాటు అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇన్‌చార్జ్ డీటీసీ ఉరీ, ఎంవీఐలు విజయ్ భాస్కర్, ఏఎంవీఐలు లక్ష్మీ ప్రసన్న, ప్రణీత తదితరులు పాల్గొన్నారు.

ప్రజలు మతసామరస్యం పాటించాలి



మాట్లాడుతున్న కడప ఆర్డీఓ మధుసూదన్

కడప కోటిరెడ్డిసర్కిల్ : ప్రజలు ఒకరి మతాన్ని మరొకరు గౌరవించుకుంటూ మత సామరస్యం పాటిస్తూ కలిసిమెలిసి జీవించాలని కడప ఆర్డీఓ మధుసూదన్, డీఎస్పీ షరీఫ్‌లు తెలిపారు. శనివారం కడప నగరంలోని ఆర్డీఓ కార్యాలయంలో పీస్ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మత సామరస్యానికి ప్రతీకగా నిలిచే జిల్లాగా వైఎస్సార్ జిల్లాకు పేరు ఉందన్నారు. ఇదే సంప్రదాయాన్ని ఇకమీదట కూడా కొనసాగించాలని వారు సూచించారు. ముఖ్యంగా సోషల్ మీడియా, వాట్సాప్, ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో వచ్చే వదంతులను నమ్మరాదన్నారు. ఈ విషయంగా ప్రజలు తమవంతుగా అధికారులకు సహకారం అందించాలన్నారు. ఎటువంటి సమస్య ఉత్పన్నమైనా సంబంధిత అధికారులను సంప్రదించి పరిష్కరించుకోవాలే తప్ప అనవసర ఘర్షణలకు పాల్పడకూడదన్నారు. జిల్లా అధికార యంత్రాంగానికి ప్రతి ఒక్కరూ సహకారం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో కడప తహసీల్దార్ శివరామిరెడ్డితోపాటు పోలీసు, ఇతర శాఖల అధికారులు, వివిధ మతాలకు చెందిన ప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రజల హృదయాల్లో సీఎం చిరకాలం ఉంటారు



సీఎం వైఎస్ జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

కడప కార్పొరేషన్ : భారత రాజ్యాంగ నిర్మాత డా. బీఆర్ అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటు చేసి, ఆవిష్కరించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలకు చిరకాలం గుర్తుండిపోతారని వైఎస్సార్‌సీపీ ఎస్సీ విభాగం జిల్లా అధ్యక్షుడు సీహెచ్ వినోద్ కుమార్ అన్నారు. శనివారం స్థానిక అంబేడ్కర్ సర్కిల్‌లో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేశారు. అనంతరం ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా వినోద్ కుమార్ మాట్లాడుతూ టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు చంద్రబాబు రాజ్యాంగానికిగానీ, ప్రజాస్వామ్యానికిగానీ విలువ ఇవ్వలేదన్నారు. దళిత, గిరిజన, బలహీన వర్గాల వారిని హీనంగా చూశారన్నారు. దళితులుగా పుట్టాలని ఎవరు కోరుకుంటారని మాట్లాడారని, బీసీలకు తోలు తీస్తా, తోకలు కత్తిరిస్తానని బెదిరించారని గుర్తు చేశారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ముఖ్యమంత్రి వైఎస్ జగన్ రాజ్యాంగానికి బద్ధుడై ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు నామినేటెడ్ పదవుల్లో రిజర్వేషన్ కల్పించారన్నారు. అన్ని వర్గాల ప్రజలు ఎంతగానో అభిమానించే డా. బీఆర్ అంబేడ్కర్ 206 అడుగుల విగ్రహాన్ని ఏర్పాటు చేయడం చారిత్రాత్మకమన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ నిత్యానందరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు బంగారు నాగయ్య యాదవ్, ఎన్. సుబ్బారెడ్డి, కార్పొరేటర్లు రామలక్ష్మణ్ రెడ్డి, ఎం. సుబ్బారెడ్డి, మల్లికార్జున, కో ఆప్షన్ సభ్యులు బండి మరియలు, పత్తిరాజేశ్వరి, పార్టీ నాయకులు శ్రీరంజన్‌రెడ్డి, బండి ప్రసాద్, సుదర్శన్‌రెడ్డి, రాజశేఖర్ రెడ్డి, లక్ష్మయ్య, లక్ష్మినారాయణ, సంపత్, రత్నకుమారి, నారాయణమ్మ, సుశీలమ్మ, తులశమ్మ, చైతన్య తదితరులు పాల్గొన్నారు.